


# THE STORY OF A MAN, A WOMEN AND A CHILD

*( ప్రథమ ప్రచురణ - నవంబర్, 1988)*

*(ప్రారంభం)*

## ది గెస్ట్

*ప్రతీ మనిషి జీవితం చదరంగం లాంటిది. చదరంగంలోని ఓ కదలిక మీద మిగతా అన్ని కదలికలు ఆధారపడి ఉంటాయి.*

*చదరంగంలోని కదలికలు అనంతం. గుర్రాన్ని కదపచ్చు. ఏనుగుని కదపచ్చు. ఆ కదలిక వల్ల తాత్కాలికంగా ఉపయోగం కనపడచ్చు.*

కాని చాలా ఎత్తుల తర్వాత ఆ ఎత్తు అసలు వేసి ఉండకూడదనిపిస్తుంది. ఆ మొదటి ఎత్తు తాలూకు ఫలితం మిగతా ఆట మీద పడుతుంది. అది మంచయినా కావచ్చు. చెడయినా కావచ్చు.

ఇదే సూత్రం మనిషి జీవితానికి కూడా వర్తిస్తుంది. ఓ సంఘటన తాలూకు ప్రతిఫలం, ప్రతిధ్వని, ప్రతిస్పందన, ఫలితం చాలా కాలం తర్వాత మిగతా జీవితం మీద పడతాయి. `ముందుచూపు అవసరం` అన్న నానుడికి అది ఈ ఫిలాసఫీనే కావచ్చు.

మైత్రి జీవితంలో ఆ ఆదివారం ఆ సంఘటన జరిగి ఉండకపోతే బెనర్జీ జీవితంలో అన్ని మార్పులు కలిగి ఉండేవి కావు. ఆ ఆదివారం నాడు ఆ ఇద్దరి జీవితాల్లో ఓ సంఘటన లేదా ఓ దుర్ఘటన జరిగింది. కాలం బెనర్జీకి దానిని గురించిన మరుపునిచ్చినా, మైత్రికి ఇవ్వలేదు. ఆ సంఘటన ఆమె మనసులో చిరంజీవి అయింది. అది మరవాలంటే ఏదో చెయ్యాలి. ఏదో ఒకటి చెయ్యాలి. ఎలా? చివరికి మైత్రికి ఓ దారి దొరికింది.

తన జీవితంలోకి ఓ ఆహ్వానింపబడని గెస్టులా ప్రవేశించిన బెనర్జీ జీవితంలోకి మైత్రి అలాగే ప్రవేశించింది - ఓ గెస్ట్‌లా.

కొందరు గెస్ట్‌లు ఏ ఇంటికి వెళ్ళినా ఆనందాన్ని ఇస్తారు. మరికొందరు గెస్ట్‌లు ఏ ఇంటి నుంచి వెళ్ళినా ఆనందిస్తారు.

మైత్రి మొదటి రకం గెస్ట్. రెండో రకం గెస్ట్ బెనర్జీ.

2

"రాత్రెలాగు తప్పదు. పగలు కూడా తాగడం ఏమిటండీ? బాధగా అడిగింది. అనసూయ.

"జస్ట్! ఫట్ మని ఒకే ఒక చిన్న పెగ్. అంతే" చెప్పాడు బెనర్జీ గ్లాసులోకి విస్కీ వంచుకుంటూ.

"మీ ఆరోగ్యం గురించి మీకు బెంగలేకపోయినా నాకుందండి. మీమీద రెండు ప్రాణాలు ఆధారపడి ఉన్నాయని మర్చిపోకండి" చెప్పింది అనసూయ.

"ఆ సోడా సీసా ఇలా ఇవ్వు. రెండు ప్రాణాలెవరివి?" అడిగాడు బెనర్జీ నవ్వుతూ.

"నేను, మీ అమ్మగారు."

"అలా వచ్చావా?" సోడా విప్పి గ్లాసులో సగం దాకా పోసుకుని పూర్తిచేశాడు బెనర్జీ. "నిజానికి నా మీద మీ రెండు ప్రాణాలే కాదు. మన ఫ్యాక్టరీలో పనిచేసే నూటఅరవై రెండు మంది ప్రాణాలు కూడా ఆధారపడి ఉన్నాయి."

ఒకే ఒక్క గుక్కలో గ్లాసులోని మొత్తం విస్కీని తాగేశాడు బెనర్జీ.

"ఇవ్వాల్టితో పగలు తాగడం ఆఖరు" చెప్పింది అనసూయ.

"ఏమిటే పిచ్చిదానా! ఒక్క పెగ్ తాగితే ఏం అయిపోదు ... సోడా మిగిలిపోయింది చూశావా? దీనికి అన్యాయం చేయకుండా ఉండాలంటే.."

ఖాళీ గ్లాసులో మరో పెగ్ పోసుకుని మిగిలిన సోడాని కలుపుకున్నాడు. నిస్పృహాయంగా చూసింది అనసూయ అతనివంక.

"ఆరోగ్యం గురించి గుర్తు చేసావు కాబట్టి దీన్ని ఇందాకట్లా ఘట్టున కొట్టేయకుండా నెమ్మదిగా తాగాలి."

కొద్దిగా సిప్ చేసి గ్లాసు టేబుల్ మీద పెట్టాడు బెనర్జీ.

భార్య మొహంలోని బాధ ఇంకా పోకపోవడం గుర్తించి చెప్పాడు బెనర్జీ.

"డోంట్ వర్రీ! ఓ రెండు పెగ్గులు వేసుకున్నంత మాత్రాన ఆరోగ్యం పాడయిపోయి చచ్చిపోను. నువ్వు బయటికి వెళ్ళేటప్పుడు సెంట్ రాసుకుంటావు చూడు ఇదీ అంతే. ఊరికే వాసన నిమిత్తమే."

పింగాణీ ప్లేట్‌లోకి బౌల్ లోంచి రెండు వేడి పెసరట్లు తనే వడ్డించుకుని ఫోర్క్, స్పూన్‌లతో తినసాగాడు బెనర్జీ.

అనసూయ విస్కీ బాటిల్‌ని టేబుల్ మీద నుంచి తీసి లోపలకి వెళ్ళిపోయింది. బెనర్జీ చిన్నగా నవ్వుకున్నాడు.

బ్రేక్ ఫాస్ట్ అయాక అనసూయ ఇచ్చిన కాంప్లాన్ కప్పు అందుకుంటూ చెప్పాడు.

"దీంట్లో రెండు చుక్కలు వెయ్యి, జస్ట్ టేస్ట్‌కి. ఎలా ఉంటుందో చూస్తాను."

"నే బ్రతికుండగా ఆ పని చెయ్యను" చెప్పింది అనసూయ చిరుకోపంగా.

"ఆల్ రైట్, బ్రతికే ఉండు" కాంప్లాన్‌ని ఓ గుక్క తాగి చెప్పాడు.

"మరీ చప్పగా ఉందోయ్ మిత్రమా."

"చక్కెర వేసానే."

"పడాల్సింది పడలేదు కాబట్టి చప్పగా ఉందన్నది"

"రోజు రోజుకీ మీరు చిన్నపిల్లవాడయిపోతున్నారు" చెప్పింది అనసూయ.

డైనింగ్ టేబుల్ ముందు నుంచి లేచి ముందు గదిలోకి వచ్చాడు బెనర్జీ. కుర్చీలో కూర్చోగానే భర్త కాళ్ళకి సాక్స్, షూస్ తొడగడం వారిద్దరి దినచర్యలో ఓ భాగం.

"రాత్రి ఎన్నింటికి వచ్చారు?"

"పన్నెండుంపావనుకుంటాను"

"అబద్ధం. ఒంటిగంటదాకా నేను మెలుకువగానే ఉన్నాను."

"మూడయింది."

చిన్నగా నిట్టూర్చింది అనసూయ.

"రోజూ రాత్రిళ్ళు అంతసేపు మేలుకుని ఉంటే మీకు నిద్రెలా సరిపోతుంది?"

"నేను సరిపెట్టుకుంటున్నాగా?"

"పైగా డ్రింక్స్ తీసుకుని... అసలు తాగడానికే మెలుకువగా ఉంటున్నారా?"

"అనూ. ఈ టాపిక్ మీద ఓ లక్షసార్లయినా చర్చించాం. మళ్ళీ పొద్దున్నే ఎందుకు చెప్పు ఇద్దరి మనసులు పాడవడానికి తప్ప"

అనసూయ బూట్లు తొడిగి లేసులు కట్టాక బెనర్జీ తన గదిలోకి వెళ్ళి డ్రస్సింగ్ టేబుల్ ముందు నిలబడి, నిలువుటద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకున్నాడు, అతని దృష్టి ఎదురుగా గోడమీద ఉన్న 'ఇయర్ ప్లేనర్' మీద పడింది. ఎర్ర రంగు ఇంటూ గుర్తులు ఆ సంవత్సరం కేలండర్ లో అక్కడక్కడా ఉన్నాయి. ఆఖరి గుర్తు ఎప్పుడుందో చూసాడు. మూడు రోజుల క్రితం.

అతనికి ఆ అమ్మాయి గుర్తొచ్చింది. పేకింగ్ సెక్షన్‌లో పని చేస్తుంది. మనిషి మొహం బావుండదు కాని మిగతా భాగాలన్నీ పొంకంగా, అందంగా తీర్చిదిద్దినట్లుంటాయి. ఆర్నెల్లుగా ప్రయత్నిస్తుంటే మూడు రోజుల క్రితం వప్పుకుంది.

"ఏమిటి? మీ వ్యాపారంలో లాభం అయిదు శాతం పెరిగిన రోజు గురించి ఆలోచిస్తున్నారా?" అడిగింది అనసూయ తన భర్త దృష్టి ఎక్కడుందో గమనించి.

"అవును" అది అతను ఆమెకి చెప్పిన అబద్ధం.

"పదండి బాస్ అయివుండి మీరు టైంకి వెళ్ళకపోతే ఇక మీ ఉద్యోగస్తులు టైంకి ఎలా వస్తారు?" చెప్పింది.

"నా జీతాన్ని ఎవరూ కోయరు. కాని టైంకి వాళ్ళు తమ కార్డ్‌లని పంచ్ చేయకపోతే వాళ్ళ జీతాన్ని తెగ్గోస్తారు. అందుకని చచ్చినట్లు టైంకి వస్తారు. అదే బాస్‌కి, వాళ్ళకి గల తేడా"

బెనర్జీ బయటకి వచ్చి ఇంపోర్టెడ్ ఎయిర్ కండిషన్డ్ ఫియట్‌లో కూర్చుని కారు స్టార్ట్ చేసాడు. కారు కాంపౌండ్ నుంచి బయటకి వెళ్ళే దాకా ఆగి, చిన్నగా నిట్టూర్చి లోపలకి వెళ్ళింది అనసూయ.

ఆ ఇంట్లోని పై అంతస్తులోని ఓ గది కిటికీలోంచి కారు బయలుదేరిన శబ్దం విన్న బెనర్జీ తల్లి చిన్నగా నిట్టూర్చింది. కళ్ళజోడు పెట్టుకుని భగవద్గీతని తెరచింది. నుదుట బొట్టులేకపోయినా, చేతులకి బంగారు గాజులు, మెడలో పగడాలు, రుద్రాక్షమాల దండలు, పట్టుచీరలో ఎంతో సలక్షణంగా ఉందావిడ.

కొద్దిసేపట్లో కోడలు చేతిలో మజ్జిగ గ్లాసుతో పైకి వచ్చింది. ఆవిడ అనసూయ ఇచ్చిన మజ్జిగ గ్లాసు అందుకుని అడిగింది.

"అబ్బాయ్ రాత్రి లేట్‌గా వచ్చాడు కదూ?"

"అవునత్తయ్యా. ఆఫీసులో ఏదో పని ఉందట"

"మీ మామగారు బ్రతికున్నప్పుడు అదే ఫాక్టరీకి మేనేజింగ్ డైరెక్టర్. కాని ఆయన ఎన్నడూ ఇలా ఆరు దాటాకా ఆఫీస్ పని మీద అక్కడే ఉండిపోలేదు"

అనసూయ సమాధానం చెప్పలేదు.

"గట్టిగా మాట్లాడాలని ఉందికాని.."

కొద్దిసేపు ఆలోచించి నెమ్మదిగా చెప్పింది.

"..కాని అడ్డాలనాడు బిడ్డలు కాని గడ్డాలొచ్చాక కాదు అని ఊరుకుంటున్నాను. ఆయనే బ్రతికుంటేనా అనిపించేది నాకోసం కాదు. వాడికోసమే"

అనసూయ మౌనంగా ఉండిపోయింది. అత్తగారు మజ్జిగ తాగాక ఖాళీగ్లాసుతో కిందకి వెళ్ళిపోయింది.

****

బెనర్జీ కారుని 'మోడ్రన్ ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రయివేట్ లిమిటెడ్' అని రాసి ఉన్న గేటులోంచి లోపలికి పోనిచ్చాడు. గేటు దగ్గర యూనిఫాంలో ఉన్న నేపాలీ గూర్ఖా అతనికి వినమ్రంగా సెల్యూట్ చేసాడు. కారుని 'మేనేజింగ్ డైరెక్టర్' అని రాసి ఉన్న కార్ షెడ్‌లో

ఆపి కారు దిగాడు బెనర్జీ. బయటకి వచ్చి పక్క షెడ్ వంక చూసాడు. 'జనరల్ మేనేజర్' అని రాసి వున్న షెడ్‌లో తెల్లరంగు మారుతీకారు ఆగి ఉండటంతో విశ్వం వచ్చాడని గ్రహించాడు.

ఫాక్టరీ ముందు భాగంలో కుడివైపు మెట్లు ఎక్కి ఎదురుగా ఉన్న తలుపు తెరుచుకుని లోపలికి వెళ్ళాడు. తలుపు మీద 'మేనేజింగ్ డైరెక్టర్' అన్న ప్లాస్టిక్ అక్షరాలున్నాయి. ఆనవాయితీ ప్రకారం అతను రాకముందే గదిలోని ఏ.సి.ని ఆన్ చేసి ఉంచారు.

బెనర్జీ ఇంటర్ కంలో రెండో నంబర్ నొక్కి చెప్పాడు అవతలి వైపు నుంచి 'గుడ్ మార్నింగ్' అని విష్ చేయగానే.

"ఓసారి రా"

క్షణాల్లో తలుపు తెచుచుకుని లోపలకి వచ్చాడు విశ్వం. అతని వయసు బెనర్జీ వయసుకన్నా నాలుగైదు ఏళ్ళ ఎక్కువ ఉంటుంది. నలభై ఒకటి. అతని జుట్టు సగం నెరిసింది. మొహం మీద స్ఫోటకం మచ్చలు. ఓ విధమయిన క్రూరత్వంలాంటిది విశ్వం మొహంలో తొణికిసలాడుతుంటుంది.

"రాత్రి బాగా లేటయింది. నీ మొహంలో తేడా తెలుస్తోంది" చెప్పాడు విశ్వం కుర్చీలో కూర్చుని.

"విస్కీ అయిపోగానే బ్రాంది తాగడం వల్ల కాక్‌టెయిల్ అయింది. దాంతో వచ్చింది ఇబ్బంది"

"అర్ధరాత్రయినా కొట్టు తెరిపిస్తానంటే నువ్వు విన్నావు కాదు" చెప్పాడు విశ్వం నొచ్చుకుంటూ.

ఇద్దరూ ఆ తర్వాత ఓ పావుగంటసేపు వ్యాపారానికి సంబంధించిన విషయాల గురించి చర్చించారు. వచ్చేది వేసవి కాలం కాబట్టి ఫ్రూట్ పల్ప్‌తో చేసిన డ్రింక్స్‌కి డిమాండ్ పెరుగుతుంది. కాబట్టి ఆ ఉత్పత్తిని పెంచాలనుకున్నారు. ప్రొడక్షన్ డిపార్ట్‌మెంట్ నుంచి గత సంవత్సరం ఉత్పత్తి స్టాటిస్టిక్స్, సేల్స్ డిపార్ట్‌మెంట్ నుంచి గత సంవత్సరం ఉత్పత్తి స్టాటిస్టిక్స్, సేల్స్ డిపార్ట్ మెంటు నుంచి అమ్మకాల వివరాలు తెప్పించి పరిశీలించారు. దానిమీద అయిదుశాతం పెంచాలనుకున్నారు.

ఆ తర్వాత పబ్లిసిటీ కేంపైన్ గురించి చర్చించాడు. కూల్ డ్రింక్స్ భారతదేశంలో లగ్జరీ తప్ప అవసరమయిన వస్తువుకాదు. వాడకందార్ల చేత దాన్ని కొనిపించాలంటే పబ్లిసిటీ తప్పదు. అందుకే ప్రతీ సాఫ్ట్ డ్రింక్ కి పబ్లిసిటీ ఉంటుంది. వాటిని కొనడానికి ఇష్టపడే మనస్తత్వం కుర్రాళ్ళలోనే ఉంటుంది కాబట్టి వాళ్ళ మార్కెట్ టార్గెట్ యూత్, వాళ్ళని దృష్టిలో ఉంచుకుని, వాళ్ళకోసమే ప్రకటనలు తయారు చేస్తుంటారు.

వ్యాపార విషయాలు ముగిసాక అడిగాడు బెనర్జీ విశ్వాన్ని.

"నిన్నరాత్రి నువ్వు చెప్పింది నిజమేనా?"

"పెప్సీకోలా ఇండియాకి రావడం గురించా? నేను పేపర్లో చదివిన వార్తే చెప్పాను."

"అదికాదు. మన ఫోర్‌మెన్ రాజులు భార్య గురించి"

చిన్నగా నవ్వాడు విశ్వం.

"నిజమే. మన ప్రొడక్షన్ మేనేజర్‌కి పదిశాతం ఉంది"

"ఎందుకు?"

"రాజులకి ఓ.టి. వేసి అర్ధరాత్రిదాకా ఫేక్టరీలో ఉంచేయడానికి అయితే మన ఫేక్టరీవాళ్ళని ఒప్పుకోదు భర్తకి తెలుస్తుందనే భయంతో. బయటివాళ్ళే"

"ఆ అమ్మాయి పేరు?"

"కృష్ణవేణి"

"ఎలా ఉంటుంది?"

"ఓ.కే"

"భర్తకి తెలియకుండా ఎందుకిలాంటి సంపాదన?" అడిగాడు బెనర్జీ.

"కృష్ణవేణి తల్లికి కేన్సర్. ఆపరేషన్ చేయాలంటే వేలల్లో ఖర్చవుతుంది. రాజులు పర్సనల్ ఫైల్ తెప్పించి చూసాను. ఇప్పటికే జి.పి.ఎఫ్. అడ్వాన్స్ పూర్తిగా తీసుకున్నాడు. అత్తగారికి చికిత్స కోసం అవసరం అని అప్లికేషన్‌లో రాసాడు. పూర్వాశ్రమంలో వేణి ఒకరిద్దరిని ప్రేమించడం, ఓసారి అబార్షన్ చేయించుకోవడం జరిగిందని కూడా విన్నాను. ఆ అనుభవంతో ఈ వ్యాపారం మొదలుపెట్టి ఉంటుంది. చాలా గడుసయిన ఆడది. ఈ రాత్రికి అరేంజ్ చేయనా?" అడిగాడు విశ్వం ఉత్సాహంగా.

"చెయ్యి. రాజులకి ఓ.టి కూడా వేయించు. "

బెనర్జీ డ్రాయర్‌లోంచి సగం నిండుగా ఉన్న విస్కీ బాటిల్ తీశాడు. విశ్వం ఓ మూలవున్న చిన్న ఫ్రిజ్ మీద ఉన్న ఓ గ్లాసు తెచ్చాడు.

"నీకు?" అడిగాడు బెనర్జీ గ్లాసులో విస్కీని వంచుకుని.

"వద్దు, సేల్స్ టాక్స్ ఆఫీస్‌కి వెళ్ళిరావాలి"

"గడుసయిన ఆడదన్నావుగా. నేను గడుసుగానే ఉంటాను. " బెనర్జీ నవ్వాడు.

ఫ్రిజ్ తెరిచి సోడాతీసి బెనర్జీ ఓ సిప్ తాగి ఇన్ ట్రేలో ఫైల్‌ని అందుకున్నాడు. క్రితం రోజు మూడు షిఫ్ట్‌లలో తయారయి వివిధ ఉత్పత్తులకి సంబంధించిన, ప్రొడక్షన్ డిపార్ట్‌మెంట్ నుంచి వచ్చిన స్టాటిస్టిక్స్‌ని చూసి వాటిమీద తన సంతకం చేసి అవుట్ ట్రేలో పడేసి ఇంటర్ కంలో ప్రొడక్షన్ మేనేజర్‌ని అడిగాడు బ్రెడ్ ఉత్పత్తి తగ్గిందేమని. పవర్ కట్‌వల్ల తక్కువైందని తెలియగానే, పర్చేజ్ ఆఫీసర్‌కి, ఇంటర్ కంలో చెప్పాడు.

"పవర్ కట్ అప్పుడు స్టాండ్ బైగా ఉండి పనిచేయడానికి జనరేటర్స్ కొందాం. ప్రపోజల్స్ పంపండి."

"అలాగే సర్. ఆఫీస్ స్టాఫ్‌కి ఈ వేసవికాలం వాటర్ కూలర్స్‌కి ప్రపోజల్స్ పంపాను. వెంటనే కొనకపోతే ఆఫ్-సీజన్ డిస్కౌంట్ పోతుంది."

"చూస్తాను" చెప్పాడు బెనర్జీ.

అతనికి నాలుగైదువేలు అందుకోసం ఖర్చు చేయడం ఇష్టం లేదు. పర్చేజ్ ఆఫీసర్ బెనర్జీకి ఆ విషయం గుర్తుచేయడం అది నాలుగోసారి.

మధ్యాహ్నం మూడింటికి చెప్పాడు విశ్వం.

"ఎర్ర గుర్తుకి అన్ని ఏర్పాట్లు జరిగాయి."

"వెరీగుడ్"

"ఇంటి అడ్రసు ఈ కాగితంలో ఉంది. నీ పేరు చెప్పి వెళ్ళు. పదిహేను వందలు. రాత్రి పదకొండున్నర తర్వాత ఉండద్దు. నీవు ఫలానా అని తెలిస్తే బెదురుతుందని, పేరు రాఘవులని చెప్పాను."

చిన్నగా నవ్వాడు బెనర్జీ.

"అంతసేపు కూడా ఉండను" చెప్పాడు.

బెనర్జీ సరిగ్గా ఆరుముప్పావుకి ఫాక్టరీ నుంచి కారులో బయలుదేరాడు. ఏడు ఇరవై అయిదుకి రాజులు ఇంటిపక్క సందులో కారాపి కృష్ణవేణి ఇంటికి నడిచి వెళ్ళాడు.

కాలింగ్ బెల్ లేదు. తలుపు తట్టాడు. తెరచుకుంది. ఎదురుగా కృష్ణవేణి.

"మీ పేరు?" అడిగింది.

"రాఘవులు!" అబద్ధం చెప్పాడు బెనర్జీ.

"రండి"

అతను లోపలికి రాగానే తలుపువేసి అడిగింది.

"డబ్బు తెచ్చారా?"

బెనర్జీ జేబులోంచి పదిహేనువందలు తీసి ఆమెకిచ్చాడు. దాన్ని లెక్కపెట్టుకుని, జాగ్రత్తగా బీరువాలో ఉంచి తాళం వేసాక చెప్పింది కృష్ణవేణి.

"పదకొండున్నరకల్లా వెళ్ళిపోవాలి"

"అలాగే"

బెనర్జీ అంతసేపు ఉండాలనుకోలేదు. కాని మరో ఆలోచన లేకుండా ఉండిపోయాడు.

కొందరు స్త్రీలు మొగాళ్ళని ఇట్టే కట్టేసుకోగలరు. సరిగ్గా పదకొండింటికి అలారం మోగింది.

"ఇక వెళ్ళాలి. మా ఆయన ఏ క్షణంలోనయినా రావచ్చు" చెప్పింది కృష్ణవేణి.

పావుగంటలో బెనర్జీ బయటకి బయలుదేరాడు అతను ఖాళీచేసిన క్వార్టర్ బాటిల్‌ని బెనర్జీకిచ్చి చెప్పింది కృష్ణవేణి.

"జేబులో వేసుకుని వెళ్ళండి. బయటెక్కడయినా పారేయండి"

బెనర్జీ చిన్నగా నవ్వి, గట్టిగా ఈలవేస్తూ బయటకి నడిచాడు. గుమ్మం దగ్గర ఆగి చెప్పాడు.

"ఈ లోకంలో మంచివారంటూ ఎవరూ లేరు. అలాగే చెడ్డవారంటూ ఎవరూ లేరు"

ఆ చిత్రమయిన అసందర్భపు మాటలకి అతనివంక ఆశ్చర్యంగా చూసింది కృష్ణవేణి

"బై.బై"

బయటకి వెళ్ళిపోయాడు బెనర్జీ.

కృష్ణవేణి గబగబ పక్కసర్ది, నలిగిన తన బట్టలని పాతబట్టల బుట్టలో పడేసి, చన్నీళ్ళతో స్నానం చేసింది. రాజులు ఇంటికి వచ్చేసరికి ఆ ఇంట్లోకి పరాయి మగాడు వచ్చి వెళ్ళిన సూచనలేం లేవు.

"లేటయిందే?" అడిగింది అతన్ని.

"ఓవర్ టైం ఉండమన్నారు"

"ఎప్పుడూ మీకే ఓవర్ టైం వేస్తుంటారేమిటి?"

"సీనియర్స్ ఇద్దరమే ఉన్నాం. కరెక్ట్‌గా మిక్స్ అవుతేకాని డ్రింక్ బావుండదు. ఒకోసారి పూర్తిగా తయారయాక బాగాలేదని మొత్తం డ్రింకుని పారపోయాల్సి వస్తుంటుంది, కొత్తవాళ్ళుంటే, అందుకని"

"అన్నం పెడతాను, స్నానం చేసి రండి"

రాజులు స్నానం చేస్తుంటే కృష్ణవేణి అన్నం వడ్డించింది. ఆమెకి తన భర్తని మోసం చేస్తున్నానన్న బాధవున్నా, తన తల్లిని బ్రతికించుకునే బాధ్యత కూడా తనమీదే ఉందనుకోవడంతో గిల్టీ కాన్షస్ అంతగా లేదు. ఏనాటికయినా తన రహస్యం బయటపడుతుందన్న బెదురు ఉంది. బయటపడ్డాక ఏమవుతుందో ఎన్నోసార్లు ఆలోచించాలనుకుంది కాని కృష్ణవేణి ఆలోచన అక్కడితోనే ఎప్పుడూ ఆగిపోతుంటుంది. భవిష్యత్‌లో జరిగే చెడుని అనుభవించడం కన్నా ఆలోచించడంలోనే భయం ఎక్కువగా ఉండటం అందుకు కారణం.

"మీ కిష్టమని ఉల్లిపాయకారం చేసాను" చెప్పింది కృష్ణవేణి రాజులుకి వడ్డిస్తూ.

"నా జీతం ఇంటికి వచ్చింది కదూ?" అడిగాడు రాజులు అన్నం కలుపుకుంటూ.

"రాలేదే?" చెప్పింది కృష్ణవేణి.

"నాకు ఓ.టి. ఉందని తెలుసుకుని, తను ఇటే వస్తున్నానని, నా జీతం ఇంట్లో ఇచ్చేస్తానని చెప్పారే మా యం.డి.? అర్ధరాత్రి పదిహేనువందల రూపాయలతో వంటరిగా రావడం మంచికాదంటే ఇచ్చాను"

తలుపు చప్పుడయింది కృష్ణవేణి లేచివెళ్ళి తలుపు తెరచింది. ఎదురుగా బెనర్జీ. అతన్ని చూడగానే రాజులు మర్యాదగా లేచి నిలబడి చెప్పాడు.

"ఇంత రాత్రి వచ్చి ఇవ్వాలా సారా?"

"ఇందాక ఏడున్నరకే ఇంట్లో ఇచ్చాను. ఇంటికి తిరిగివెళుతూ, లైటు వెలగటం చూసి ఉవ్వు వచ్చి ఉంటానని చూసిపోదామని వచ్చాను"

"థాంక్యూ సర్!"

"నేనెందుకు నీకీ హెల్ప్ చేసానా అనుకుంటున్నావు కదా రాజులు? ఈ లోకంలో ఎవరూ మంచివారు కారు. అలాగే ఎవరూ చెడ్డవారు కారు. గుడ్ నైట్"

కృష్ణవేణి గొంతులోని మాటలు గొంతులోనే ఆగిపోయాయి. బెనర్జీ వంక అసహ్యంగా, కోపంగా చూసింది. బెనర్జీ బయటకి వెళ్ళిపోయాడు.

"చాలా మంచివాడు, ఏ యం.డి అయినా ఇలా ఇంటికి తెచ్చిఇస్తాడా?" చెప్పాడు రాజులు మళ్ళీ కంచం ముందు కూర్చుని.

కృష్ణవేణి వెంటనే బాత్ రూంలోకి వెళ్ళింది. తలుపు వేసుకుని ఏడుపుని బలవంతంగా ఆపుకోవాలని ప్రయత్నించింది కాని అది ఆమెకి సాధ్యపడలేదు. కొంగుతో నోరు నొక్కుకుని శబ్దం బయటికి రాకుండా ఏడ్చింది. నాలుగైదు నిమిషాల్లో దుఃఖం తన కంట్రోల్ లోకి వచ్చాక నీళ్ళతో మొహం కడుక్కుని బయటికి వచ్చింది

కృష్ణవేణి ఏడ్చింది తనని మోసం చేసి బెనర్జీ పదిహేనువందలు నష్టపరచినందుకు కాదు. వెలకట్టకుండా కొద్దో గొప్పో మిగిలిన తన శీలాన్ని దోచుకున్నందుకు కూడా కాదు. తను మోసపోయాననే బాధ కూడా కాదు.

మర్నాడు ఉదయం డాక్టర్కి ఇచ్చేందుకు డబ్బులేనందుకు, కేన్సర్ చికిత్సకి ముఖ్యమయిన తన తల్లి రేడియో థెరపీ వాయిదా పడినందుకు.

* * *

(ఇంకా ఉంది)

Post your comments